మినీకథ

# టీజింగ్

సురేష్

చలిగాలి రివ్వున వీస్తోంది: రామేళం సైకిల్ స్పీడ్‌గా తొక్కుతున్నాడు. చలి వెన్ను వరకు పాకి నిలువెల్లా వణికిస్తోంది. కొత్తగా విడుదలయిన సినిమాలోని మషాలా పాట ఒకటి పాడుకుంటున్నాడు. రాత్రి ఎనిమిది గంటలయిందో లేదో చలికాలం కావడంతో బందరు రోడ్ నిర్మానుష్యంగా కనిపిస్తోంది. బియ్యే ఫైనల్ ఇయర్ చదువుతున్న రామేళానికి ఆ చలిలో కాలేజీలోని అమ్మాయిలందరూ గుర్తొస్తున్నారు. లబ్బీపేటకు వచ్చిన తర్వాత యథాలాపంగా ముందుకు చూసిన రామేళం ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. అప్పుడే.. ఆ టర్నింగ్‌లో ఓ అమ్మాయి సైకిల్ తొక్కుకుంటూ వచ్చి కలిసింది. పంజాబీ డ్రెస్‌లో ఉన్న ఆ అమ్మాయి సైకిల్ వెనుక బుక్స్ ఉండటంతో 'బహుశా స్టెల్లా కాలేజీ పిల్లేమో' అనుకున్నాడు స్వగతంగా.

ఇంతలో....

అదే సెంటర్లో మరొకడు వచ్చి కలిశాడు. ఇన్‌షర్ట్ చేసి బాగా 'స్టయిల్'గాఉన్నాడు. పంజాబీ డ్రెస్ అమ్మాయితో సమానంగా ఇన్‌షర్ట్ కుర్రోడు సైకిల్ తొక్కుతున్నాడు. ఎవడో అపరిచితుడైనప్పటికి ఇద్దరూ పక్కపక్కనే వెళ్తుండటంతో రామేళం గుండెల్లో సన్నటి మంట చెలరేగింది. "మధ్యలో ఎవడీ వెధవ దాటిపోతే బావుండును. నేను ఆ పంజాబీ డ్రెస్ పిల్ల సైడు వెళదామనుకుంటుంటే వీడెవడూ శనిలా దాపురించాడు" అంటూ రామేళం శాపనార్థాలు పెడుతున్నాడు. పంజాబీ డ్రెస్ అమ్మాయి— ఇన్‌షర్ట్ కుర్రోడి వైపు తిరిగి నవ్వింది. నుదుటికి పట్టిన చెమట తుడుచుకుంటూ అది గమనించిన



రామేళం ఒళ్ళు మండ

"ఈ ఇన్‌షర్ట్ కుర్రోడు మరోవైపుకి వెళ్ళిపోతే బావుండును.

పోయింది. తన ఆస్తిని పరాయివాడెవరో చేజిక్కించుకుంటున్న ఫీలింగ్....

లేకపోతే ఏ బస్సో వచ్చి వీడికి గుద్దేసి వెళ్ళిపోతే బావుండును" వంటి ఆలోచనలు రామేళం మెదడులో కొల్లలుగా వచ్చి చేరుతున్నాయి.

ఇక లాభం లేదనుకొని

రామేళం తన సైకిల్ స్పీడ్ పెంచాడు. కష్టపడి పంజాబీ డ్రెస్ అమ్మాయి సైకిల్‌ను అందుకున్నాడు. ఇప్పుడు పంజాబీ డ్రెస్ అమ్మాయికి పక్క రామేళం మరో పక్క ఇన్‌షర్ట్ కుర్రోడు వెళ్తున్నారు. పంజాబీ డ్రెస్ అమ్మాయి రామేళం వైపు చిరాగ్గా చూసి సైకిల్ స్పీడ్ పెంచింది. రామేళం 'నీకు నేనేమీ తీసిపోనను కుంటూ' తనూ స్పీడ్ పెంచాడు. ఇన్‌షర్ట్ కుర్రోడూ స్పీడ్ పెంచాడు. లైట్ల వెలుతురు కొద్దిగా తగ్గుతున్న చోట్ల ఇన్‌షర్ట్ కుర్రోడు, ఆ అమ్మాయికి దగ్గరగా రావడాన్ని రామేళం గమనించాడు. తను 'అడ్వాన్స్' కాకపోతే ఆ పిల్ల తనను ఓ వెధవాయి కింద జమకడుతుందని నిశ్చయించుకొని రామేళం ధైర్యం చేశాడు. టిక్కిల రోడ్ దగ్గరకువస్తున్న సమయంలో పంజాబీ డ్రెస్ అమ్మాయి పక్కగా వెళ్ళి ఆమె చేతిపై చేయి వేశాడు.

మరుక్షణంలో....

ఇన్‌షర్ట్‌వాడి సైకిల్ వచ్చి రామేళం సైకిల్‌ను బలంగా ఢీకొనడంతో ఇద్దరూ రోడ్డు మీద పడ్డారు.

ఏం జరుగుతుందో రామేళం తెలుసుకునేంతలో...

పిడిగుద్దులు.... రామేళం ముఖంపై పిడి గుద్దులు....

ఒకటి...

రెండు....

మూడు....

రామేళం నోటికి వెచ్చటి నెత్తురు ఉప్పగా తగిలి స్పృహతప్పుతుండగా—

"ఇంక ఊరుకోరా అన్నయ్యా— వాడినొదిలెయ్. ఎవడో జులాయి వెధవ. మనకు ట్యూషన్ టైమ్ అవుతోంది' అన్న పంజాబీ డ్రెస్ అమ్మాయి మాటలు లీలగా విన్పించాయి. •

